పోటీపడి విద్యాభ్యాసం

- ఏటా పది, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత
- చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్‌లో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి
- సకల సౌకర్యాలు, చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు


చిన్నముల్కనూర్‌లోని ఆదర్శపాఠశాల ముఖద్వారం

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు పోటీపడి విద్యనభ్యసిస్తున్నారు. పది, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. 2013–14 విద్యా సంవత్సరంలో స్కూల్ ప్రారంభం కాగా అప్పటి నుంచి ఉత్తీర్ణత శాతం కొనసాగుతూనే ఉంది. మొదట పాఠశాలలో ఆరు నుంచి నుంచి ఎనిమిది వరకు తరగతులు ఉండేవి. 2015–16 నుంచి పది, ఇంటర్మీడియట్ స్థాయి వరకు పెంచారు. మంచి వాతావారణం, సకల సౌకర్యాల మధ్య విద్యాభ్యాసం కొనసాగుతోంది. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందిస్తోంది.

• ఏటా వందశాతం ఉత్తీర్ణత

2015–2023 వరకు ఏటా పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 2016–17లో ఒకరికి, 2019–20లో 26 మందికి, 2020–21లో పది మందికి 10 జీపీఏ వచ్చింది. ఈ విద్యాసంవత్సరం 2022–23 ఒక విద్యార్థికి 10జీపీఏ వచ్చింది. 2015–22 వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు ఉన్నాయి. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉపాధ్యాయులు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారు.

• క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు

మోడల్ స్కూల్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. గతేడాది నిర్మల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఐదుగురు విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ విద్యా సంవత్సరం ఇద్దరు విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు.

• కంప్యూటర్ ల్యాబ్

తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ కూడా ఇస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్ కూడా అందుబాటులో ఉంది. చదువుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం మంచి భవిష్యత్‌కు పునాది పడుతుందని పలువురు విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

• ఉచిత భోజనం, వసతి సౌకర్యం

మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉంది. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు వంద మందికి వసతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. పాఠశాలలో చదివే 730 విద్యార్థులకు సురక్షిత తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, రన్నింగ్ వాటర్ సదుపాయం ఉంది.

ఐఏఎస్ అవ్వాలని ఉంది



పదో తరగతిలో 10 జీపీఏ సాధించాను. భవిష్యత్‌లో ఐఏఎస్ కావాలని ఉంది. ప్రస్తుతం బాసర ట్రిపుల్ ఐటీలో చదివేందుకు దరఖాస్తు చేశాను. సీటు తప్పనిసరిగా వస్తుందని నమ్మకం ఉంది. పాఠశాలలో మంచి విద్యాబోధన అందిస్తున్నారు.

– గుల్ల తేజస్విని, పదో తరగతి, నవాబుపేట్

మంచి విద్యాబోధన



మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు మంచి విద్యాబోధన చేయడం వల్లే ఇంటర్ సెకండియర్‌లో 958 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు పొందాను. డాక్టర్ కావాలని ఉంది. ఎంసెట్ రాశాను మంచి ర్యాంకు వచ్చింది.

– తోట సిరిచందన, ఇందుర్తి

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



విద్యార్థులకు మంచి క్రమశిక్షణతోపాటు ఉత్తమ ఫలితాల సాధనకు నిరంతరం కృషి చేస్తున్నాం. పది, ఇంటర్‌లో ర్యాంకులు సాధించేలా ఉపాధ్యాయులతో కలిసి కష్టపడి పని చేస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం .

– కొడిమ్యాల శ్రీనివాస్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

నేడు కంటి వెలుగు శిబిరం

హుజూరాబాద్: పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో మంగళవారం ప్రత్యేక కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేయనున్నామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు సోమవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు ఇస్తామని, కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ప్రత్యేక కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అవకాశాన్ని హుజూరాబాద్ పట్టణ ప్రజలు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, ఆప్తాలమిక్ ఆఫీసర్స్ రఘోత్తంరెడ్డి, జలందర్ , తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన గీత కార్మికులకు రూ. రెండు లక్షలు ఇవ్వాలి

చిగురుమామిడి: ప్రమాదవశాత్తు తాటి, ఈత చెట్ల పైనుంచి కిందపడి గాయపడిన గీతకార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.రెండు లక్షల ఆర్థికసాయంతో ఆదుకోవాలని చిగురుమామిడి మండల గౌడ సంఘం అధ్యక్షుడు తాల్లపల్లి తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కొండాపూర్‌లో రెండు రోజుల క్రితం తాటిచెట్టు పైనుంచి పడిన గుడాల ఓదయ్య మంచానికే పరిమితమైన దీనస్థితిని తెలుసుకున్నారు. గాయాలపాలయైన గీత కార్మికులు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయన్నారు. చెట్టుపై నుంచి పడి మృత్యువాత పడితే ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంట సంపత్, శ్రీనివాస్, కుమారస్వామి తో పాటు పలువురు ఉన్నారు.

క్లుప్తంగా

భారత రెజ్లర్ల అరెస్ట్‌ను ఖండించిన టీజేఎస్

హుజూరాబాద్: పార్లమెంట్ ప్రారంభోత్సవం రోజున న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లైంగికంగా వేధించిన భారత రెజ్లర్ల సమైక్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న భారత రెజ్లర్లు సాక్షి మలిక్, బజరంగ్ పునియా, సంగీత, వినేశ్ ఫొగాట్‌ను అరెస్టు చేయడాన్ని తెలంగాణ జన సమితి తీవ్రంగా ఖండిస్తుందని టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు అన్నారు. సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగికంగా వేధిస్తున్నాడని 36 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తుంటే స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. అత్యాచారాలు చేస్తున్న ఎంపీకే వత్తాసు పలుకుతున్నారంటే బేటి బచావో–బేటి పడావో అంటే ఇదేనా అని ప్రశ్నించారు. క్రీడారంగంలో బంగారు పతకాలు సాధించి దేశ చిత్రపటాన్ని ప్రపంచంలో నిలబెట్టిన ఘనత సాక్షి మలిక్, బజరంగ్ పునియాలకే న్యాయం జరగకుంటే సామాన్యుల పరిస్థితి ఏంటని అన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధితులని అరెస్టు చేయడం హేయమైన చర్య అని అభివర్ణించారు. రెజ్లర్లకు పార్టీలకతీతంగా ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు ఐక్య ఉద్యమాలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

పశుగ్రాసం అందజేత


పశుగ్రాసం పంపుతున్న రైతులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, ఎడవెల్లి రమణారెడ్డి, కచ్చు బీరయ్యలు పశుగ్రాసం అందజేశారు. వారి పంటపొలంలోని వరి గడ్డిని కట్టలు కట్టించి సోమవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయం కోడెలకు ట్రాక్టర్‌లో పంపించారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న జేఎస్‌ఆర్

సైదాపూర్: తెలంగాణలో కేసీఆర్ అవినీతి పాలన అంతమొందించి, బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని గొడిశాలలో ఏర్పాటు చేసిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ భూటకపు, మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అబద్ధాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. వొడితెల సతీశ్‌కుమార్ హుస్నాబాద్‌కు ఎమ్మెల్యేగా ఉండి పైసా పని చేయలేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయని, ఎన్నడూ లేని ఆత్మీయత వొలకబోస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి తరలిరావాలి


మాట్లాడుతున్న నాయకులు

హుజూరాబాద్: హైదరాబాద్‌లో ఆరెకరాల స్థంలో రూ.12 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ సదనం భవనాన్ని ఈ నెల 31న సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. బ్రాహ్మణులు తరలివచ్చి విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాల్‌రావు కోరారు. సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేసి బీద బ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థికసాయం, ఉపాధి కోసం రూ. 3 నుండి రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ , జిల్లా కార్యదర్శి, సంపత్ కుమార్, జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు దీపక్‌బాబు, రంగారావు నాగేంద్ర శర్మ, ప్రేమ్ చందర్, భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

చాడ వెంకట్‌రెడ్డి పరామర్శ

చిగురుమామిడి: మండలంలోని రేకొండ లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చాడ మల్లవ్వ కుటుంబ సభ్యులను సోమవారం సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందన్నారు.

'దశాబ్ది' ఉత్సవాల్లో భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీవరకు నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఊరూరా ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం నియోజకవర్గంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ సాధించుకొని పదేళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం వేడుకలు నిర్వహించాలని సూచించారు. అందరి పోరాటం ద్వారానే తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. చెరువులు, కుంటలు మరమ్మతులకు నోచుకున్నాయని, ప్రాజెక్టులతో బీడు భూములు సాగుకు నోచుకున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఆరు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా ఉత్సవాలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపుకుందామని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాలపై నియోజకవర్గ స్థాయి, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు శాఖల వారీగా నిర్వహించే కార్యక్రమాలను ప్రభుత్వం తెలియజేసిందన్నారు. ఆయా శాఖల అధికారులు వెయ్యి మందికి తగ్గకుండా కార్యక్రమం నిర్వహించాలన్నారు. తొమ్మిదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించాలన్నారు. ఉత్సవాల్లో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ భాగస్వాములు కావాలన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని, అదే స్థాయిలో పని చేయాలని కోరారు. చివరి రోజు అమరుల త్యాగాలు స్మరించుకుంటూ హుజూరాబాద్ అమర వీరుల స్థూపం వద్ద పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జెడ్పీచైర్ పర్సన్ కనుమల్ల విజయ, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, హుజూరాబాద్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవి

ఇల్లందకుంట: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఓటర్ నమోదు, సవరణ ప్రక్రియపై సోమవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ మాధవి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి ఓటరు నమోదు సవరణకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ వరలక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వార్డు కమిటీ


ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం ఒకటో వార్డు బీఆర్‌ఎస్ నూతన కమిటీని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన స్థానిక కౌన్సిలర్ బొంగోని వీరన్న ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షుడిగా బుర్ర సంపత్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మల్లాది రవీందర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్రవేన సునీత, ఉపాధ్యక్షురాలు తలగంపా వనజ, బీసీ విభాగం అధ్యక్షుడిగా మురహరి రవి, ఉపాధ్యక్షుడిగా పోలు కొండల్, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా పాత సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా తలగంప లింగయ్య, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఎండీ రఫీ, ఉపాధ్యక్షుడిగా బాషుమియా, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా బండి సాయి, ఉపాధ్యక్షుడిగా మొట్టు వినయ్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా రెబెల్లి స్వామినాథ్, ఉపాధ్యక్షుడిగా హని నాగేంద్ర ఎన్నికయ్యారు.

అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి


కందుగులలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: గ్రామాలాభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కందుగుల గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని జెడ్పీచైర్ పర్సన్ కనుమల్ల విజయతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పల్లెల్లో ప్రగతి కనిపిస్తుందని, తెలంగాణ పల్లెలు కేంద్రం నుంచి అవార్డులు తీసుకుంటుంటే...అభివృద్ధి ఏం చేయలేదంటూ బీజేపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. అనంతరం రూ. 20 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘం, రూ.9 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ మహిళా సంఘ భవనాలకు, రూ.2.60 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ బక్కారెడ్డి, సర్పంచ్ ప్రభావతి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మట్టితీత ప్రారంభం



గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామ చెరువులో సోమవారం మట్టితీత పనులను ఎట్టకేలకు అధికారులు ప్రారంభించారు. చెరువులో ఆలయ నిర్మాణానికి సంబంధించి చెరువు కట్ట సమీపంలోని శిఖంలోకి గ్రామస్తుల ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారు. కొందరు గ్రామస్తులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లారు. దీంతో ఆలయ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో అనేక అభ్యంతరాలు, ఆందోళనల అనంతరం చెరువులోకి తరలించిన మట్టి తిరిగి తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మట్టిని రైతులు ట్రాక్టర్ల ద్వారా తమ పొలాలోకి తీసుకెళ్తున్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి

- ఎంపీపీ కేతిరెడ్డి వనితారెడ్డి
- మండల సర్వసభ్య సమావేశంలో సమస్యల ప్రస్తావన
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో చర్చించి పరిష్కరిస్తామని హామీ


సభలో మాట్లాడుతున్న సర్పంచ్ అంజయ్య

తిమ్మాపూర్: పల్లెల అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని ఎంపీపీ కేతిరెడ్డి వనితారెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ వనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. సభలో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. మండల స్థాయి సమావేశంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొనక పోవడంపై పొలంపల్లి ఎంపీటీసీ బండారి రమేశ్ అసహనం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో దాతల సహకారంతో వైద్య ఆరోగ్యశాఖకు భూమి కేటాయించామన్నారు. ఎన్నేళ్లయినా అధికారులు దాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదని మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య మండల వైద్యాధికారికి తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సభలో విన్నవించారు. ఎంపీపీ వనిత మాట్లాడుతూ... గ్రామాల్లో ఇప్పటివరకు చాలా అభివృద్ధి పనులు పూర్తి చేశామని, ఇంకా ఏమైనా మిగులు పనులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారుల సహకారంతో తిమ్మాపూర్ మండలానికి జాతీయస్థాయి అవార్డు రావడం చాలా గర్వకారణమన్నారు. మండలానికి వచ్చిన నిధులను అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం నిర్వహించి కేంద్ర నిధుల్ని ఉపయోగిస్తామన్నారు. జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ప్రతి గ్రామంలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎమ్మార్వో కనకయ్య, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కేతిరెడ్డి వనిత

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తప్పిన పెను ప్రమాదం

జమ్మికుంట: పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఢీకొట్టింది. సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. స్థానికుల కథనం ప్రకారం ఆర్టీసీ కరీంనగర్ డిపోకు చెందిన బస్సు కరీంనగర్ నుంచి జమ్మికుంటకు చేరుకుంది. గణేష్‌నగర్ హనుమాన్ ఆలయం వద్ద సెంట్రల్ లైటింగ్ స్తంభానికి అదుపు తప్పి ఢీకొంది. బస్సులో ప్రయాణికులు ముగ్గురు మాత్రమే ఉన్నారు. అందులో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాలేదు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

• పరీక్ష రద్దు చేయాలి

కరీంనగర్: ఆశా కార్యకర్తలకి ప్రవేశ పరీక్ష రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అబ్దుల్ కదర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు.

వానాకాలం సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాస్

శంకరపట్నం: ఆయిల్‌పామ్, వానాకాలం సాగుపై సోమవారం కన్నాపూర్ రైతువేదికలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు చల్లిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏవో శ్రీనివాస్ వివరించారు. నాటు వేసే వారం ముందు పిచికారీ చేయాల్సిన విధానం వివరింరు. ఐదెకరాలు పైబడిన రైతులు వ్యవసాయభూమిలో రెండెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి మంజువాణి, ఏఈవో సునంద, సర్పంచులు రేణుక, వెంకటరమణారెడ్డి, రైతులు వీరస్వామి,తిరుపతిరెడ్డి,రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.